


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 302 | శనివారం 29 నవంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## అమరావతిని అగ్రగామి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం: కేంద్రమంత్రి

**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** అమరావతి నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించడం అంటే ఒక యజ్ఞం వంటిదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అమరావతిలో బ్యాంకు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం నూతన రాజధాని నిర్మాణం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. ఆర్థికంగా ఎంతో వ్యయప్రయాసలను కూర్చాల్సి ఉంటుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశంలోనే అగ్రగామి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రూ. 1334 కోట్ల వ్యయంతో 25కు పైగా బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు.

అమరావతి నిర్మాణం ఆగిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేయడం శుభ



పరిణామంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పం కలిసి రాష్ట్రానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయన్నారు. రాజధాని మౌలిక వసతుల కల్పన కోసం, ప్రత్యేకించి ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కట్టుబడి ఉందన్నారు. అమరావతి అభివృద్ధికి అవసరమైన నిధులను, సాంకేతిక సహకారాన్ని కేంద్రం అందిస్తుందని వివరించారు.

## ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన

### 'అలాంటి వాటిని రద్దు చేస్తాం'



**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సంగ్రామం షురూ అయ్యింది. మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదల కావడంతో.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇక మొదటి రోజే భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఏకగ్రీవాలు జోరందుకుంటున్నాయి. ఈ క్రమంలో సర్పంచులు, వార్డు మెంబర్ల ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. బలవంతపు ఏకగ్రీవ ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఏకగ్రీవాల్లో పలు మోసాలు జరుగుతున్నాయని.. బలవంతంగా ఏకగ్రీవాలకు అంగీకరించేలా చేస్తున్నారని.. వేలం పాట ద్వారా ఏకగ్రీవాలు జరుగుతున్నట్లు ఈసీకి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..

తెలంగాణ జాగృతి చీఫ్ కవిత రైల్ రోకో



## చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్‌కు గుడ్ న్యూస్..

కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన



## యువకుడు వేధిస్తున్నాడని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం



## పోలీస్ వాహనంపై మృతదేహం ఎక్కించి నిరసన.. నిజామాబాద్ జిల్లాలో ఘటన



## కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ఒక్క చుక్క కాళేశ్వరం నీళ్లు కూడా రాలేదు: కవిత



## పల్నాడు జంట హత్యల కేసు.. పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ



# జనవరి 1న సరెండర్ అవుతాం

## MMC జోన్ ప్రతినిధి అనంత్ పేరిట లేఖ విడుదల


भारत की कम्युनिस्ट पार्टी (माओवादी)
COMMUNIST PARTY OF INDIA (MAOIST)
(महाराष्ट्र-मध्यप्रदेश-छत्तीसगढ़ स्पेशल जोनल कमिटी)
दिनांक- 27 नवंबर 2025

- మల్లోజుల-ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్ ప్రభావం
- సరెండర్ వరకు కూబింగ్ ఆపరేషన్లు ఆపాలన్న డిమాండ్
- ఎవరు ఎక్కువ సహకరిస్తే ఆ ప్రభుత్వ సమక్షంలోనే లొంగుబాటు
- మావోయిస్టులకు కొత్త ఆదేశాలు - హింసాత్మక చర్యలు నిషేధం
- రోజూ రేడియో కమ్యూనికేషన్ కోసం ఓపెన్ ఫ్రీక్వెన్సీ విడుదల
- మూడు రాష్ట్రాల భద్రతా దళాలకు అలర్ట్ - కేంద్రం సమీక్షలో పరిణామాలు

దండకారణ్యాల్లో భద్రతా బలగాలు ఎన్‌కౌంటర్ల మోత మోగుతున్న వేళ మావోయిస్టు పార్టీ నుంచి ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో మరో సంచలన లేఖ విడుదలైంది. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. కమ్యూనికేషన్ కోసం ఓపెన్ ఫ్రీక్వెన్సీ నెంబర్‌ను కూడా విడుదల చేశారు. ఒక్కొక్కరు కాకుండా అంతా ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంది బీజేపీ నేతలే..విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర ఆరోపణలు



**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీ నేతలేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. ఇవాళ హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పగటిపూట బీసీల గొంతు కోసిన బీజేపీ నాయకులు ఇప్పుడు రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు రిజర్వేషన్లు రాకుండా అడ్డుకున్నది బీజేపీ నాయకులే, వీరు బీసీ ద్రోహులు, వెన్నుపోటు దారులని ఆరోపించారు.

## మంగ్లీ పాటపై అసభ్యకర కామెంట్స్..


### కేసు పెట్టడంతో దిగొచ్చిన మేడిపల్లి స్టార్



**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** ఈ మధ్య ట్రోల్స్ పేరుతో సోషల్ మీడియాలో కొందరు రెచ్చిపోతున్నారు. అది ట్రోల్ కంటెంట్ అయినా కాకపోయినా లైకులు, షేర్ల కోసం ఆరాటపడుతూ ట్రోల్స్ పేరుతో భూతులు తిట్టడం, అసభ్యకర కామెంట్స్ చేయడం కామన్ గా మారింది. తాజాగా అలాంటి పరిస్థితే ఫోక్ సింగర్ మంగ్లీకి వచ్చింది. మంగ్లీ బావిలోనే బల్లిపడితే అనే పాటను రీసెంట్ గా విడుదల చేయగా ప్రస్తుతం ఆ పాట ట్రెండింగ్ లో ఉంది. ఐదురోజుల్లోనే 8మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి.అయితే ఈ పాటపై సోషల్ మీడియాలో ట్రోల్స్ చేసే ఓ వ్యక్తి అసభ్యకర కామెంట్స్ చేశాడు.

## పంచాయతీ ఎన్నికలపై స్టే విధించలేం..

### తెలంగాణ హైకోర్టు సంచలన ఉత్తర్వులు




**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం నవంబర్ 22న జీవో నెం.46ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కలిపి రిజర్వేషన్లు మొత్తం 50 శాతం కంటే ఎక్కువ కాకూడదని ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో జీవో నెం.46 ప్రకారం చట్టవిరుద్ధంగా రిజర్వేషన్లు కేటాయించారని, వెంటనే పంచాయతీ ఎన్నికలు నిలిపివేయాలని సవాలు చేస్తూ వెనుకబడిన కుల సంఘాలు వేర్వేరుగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు ఇవాళ వారి పిటిషన్లపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సర్కార్ విడుదల చేసిన జీవో నెం.46పై ఈ దశలో తాము స్టే ఇవ్వలేమని స్పష్టం చేశారు.

ఇరు పక్షాల వాదనల సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ.. సబ్ కేటగిరి రిజర్వేషన్ లేకపోవడం వల్ల ఎన్నికలు రద్దు చేయాలని కోరుతున్నారా..? అని పిటిషనర్ల తరఫు న్యాయవాదులను ప్రశ్నించారు.

## ఏపీ సర్కార్ మరో బిగ్ ప్లాన్..

### తెరపైకి పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్ట్

**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** మొన్నటి వరకు పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన ఏపీ ప్రభుత్వం.. ఇటీవల ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. తాజాగా.. 'పోలవరం-నల్లమలసాగర్' లింక్ ప్రాజెక్ట్‌ను తెరమీదకు తీసుకొచ్చింది. అంతేకాకుండా.. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌ను తయారు చేసేందుకు టెండర్ నోటీసును జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసును విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన విచారణలు నిర్వహించడం, అలాగే భారత ప్రభుత్వ సంస్థల నుంచి తప్పనిసరిగా పొందాల్సిన అన్ని చట్టబద్ధమైన క్లియరెన్స్‌లను



సంపాదించడం వంటి పనులు ఇందులో ఉన్నాయి. ఈపీసీ టర్న్ కీ సిస్టమ్ పద్ధతిలో ఈ టెండర్లను ఆహ్వానించారు. ఈ నెల 21న ఈ టెండర్ నోటీసు జారీ చేయగా.. 12 నెలల టైం పీరియడ్‌తో రూ.7.68 కోట్లతో ఆహ్వానించారు. గురువారం నుంచి టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ ప్రక్రియను తెరువగా.. బిడ్ సబ్మిట్ చేసేందుకు వచ్చేనెల 11 వరకు అవకాశం కల్పించారు.

కెరటం న్యూస్

శనివారం 29 నవంబర్ 2025

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..

## తెలంగాణ జాగృతి చీఫ్ కవిత రైల్ రోకో

**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కామారెడ్డి పట్టణంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తమ కార్యకర్తలతో కలిసి రైల్ రోకో నిర్వహించారు. అనంతరం వారు ట్రాక్‌పై కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు అప్రమత్తమైన కామారెడ్డి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి జాగృతి నేతలను అక్కడ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం దారుణం" అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు కుట్రలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు.

# చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్‌కు గుడ్ న్యూస్..

## కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** ప్రజల బాగోగులు కాక్షించి బ్లండ్ బ్యాంక్, ఐ బ్యాంక్‌ను నడువుతున్న మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ కు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు ఇక నుంచి ఆ సంస్థ స్వదేశంలోనే కాకుండా విదేశీ విరాళాలు కూడా స్వీకరించేందుకు అనమతిని ఇచ్చినట్లుగా కేంద్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. కాగా, ఇటీవల విదేశీ విరాళాలకు ఎఫ్‌సీఆర్‌ఏ పర్మీషన్ తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం-2010 కింద ఆయా ట్రస్టులు తమ పేర్లను పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది. అయితే, నిబంధనల మార్పుతో చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాయగా.. విదేశీ విరాళాలు స్వీకరించేందుకు ఆమోద ముద్ర వేశారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు

## ఒక్క చుక్క కాళేశ్వరం నీళ్లు కూడా రాలేదు: కవిత

**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కామారెడ్డికి నీళ్లు వస్తాయని, నిజామబాద్, దుబ్బాక, భాన్సువాడలకు నీళ్లు వస్తాయని ప్యాకేజీ 22 మొదలు పెట్టారన్నారు. ప్యాకేజీ 22కు మొత్తం రూ.1446 కోట్లు కావాలన్నారు. కానీ ఇప్పటి వరకు 450 కోట్లు ఇచ్చారని చెప్పారు. అంతే కాకుండా ప్యాకేజీ 22 కట్టాలంటే 1500 ఎకరాల భూమి కావాలన్నారు. కానీ అందులో రెండో వంతు భూమిని కూడా సేకరించలేదని చెప్పారు. బీఆర్ఎస్ వాళ్లు తనపై కంపనోరేసుకుని అరుస్తారని కానీ కాళేశ్వరం ప్రాజెక్టుతో కామారెడ్డి జిల్లాలో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాలేదన్నారు. ఇంత వరకు నిజామాబాద్ కు కూడా రాలేదని చెప్పారు. ఒకేఒక్కసారి హల్దీవాగు నుండి నీళ్లు తీసుకువచ్చి నాజాంసాగర్ నింపారన్నారు. తరవాత నాలుగేళ్లు పుష్కలంగా వర్షాలు కురిశాయని దాని అవసరమే లేకుండా పోయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చుక్క నీరు కూడా రాలేదన్నారు. ఇదిలా ఉంటే గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని సైతం కవిత ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో హరీష్ రావు వల్లనే కేసీఆర్‌కు అవినీతి మరక అంటుకుందని వ్యాఖ్యానించారు.

# బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంది బీజేపీ నేతలే

## విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర ఆరోపణలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందన్నారు. తాము పంపిన బిల్లులను ఆమోదించకుండా బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అడ్డుపడటం దారుణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించకుండా నోరు మూసుకున్న బీజేపీ నాయకులు ఇప్పుడు రేవంత్ రెడ్డిపై ఎగిరెగిరి పడుతుండటం హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తం చేశారు.


బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కు కనీసం సిగ్గు అనిపించడం లేదా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆయన కూడా సీఎంపై ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు ఇచ్చి.. ఢిల్లీలో మాట మార్చింది బీజేపీ కాదా అని ప్రశ్నించారు. బీసీలకు తీరని అన్యాయం చేసింది బీజేపీనే అని అన్నారు. ఢిల్లీ లో బీసీ బిల్లులను ఆమోదించాలని రాష్ట్ర కాంగ్రెస్ అధినాయకత్వం జంతర్ మంతర్ దగ్గర ధర్నాలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు కాశాయని అన్నారు. బీజేపీ ద్రోహులను బీసీలు గమనించి సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. బీసీ బిడ్డ అని చెలామణి అవుతున్న లక్ష్మణ్.. ఆ బీసీలకే తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మణ్.. బీసీ బిల్లు ఆమోదించాలని ప్రధాని మోదీ పై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదన్నారు. తన పదవి పైన తప్ప బీసీలపైన ఇసుమంత ప్రేమ కూడా లక్ష్మణ్‌కు లేదన్నారు. గాంధీ కుటుంబం గురించి ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని.. ప్రధాని పదవినే త్యాగం చేసిన చరిత్ర వాళ్లదని అన్నారు. ఎప్పటికైనా తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు సాధించేది కాంగ్రెస్ పార్టీనే అని ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

# పంచాయతీ ఎన్నికలపై స్టే విధించలేం..

## తెలంగాణ హైకోర్టు సంచలన ఉత్తర్వులు

ఈ క్రమంలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండదని ఈసీ తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించగా ఆ మాటతో ధర్మాసనం కూడా ఏకీభవించింది. అనంతరం చీఫ్ జస్టిస్ రియాక్ట్ అవుతూ.. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు చేపట్టాలని చెప్పాం కదా అని కామెంట్ చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద ఉద్రిక్తత



**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** సినిమా థియేటర్లలో ధరలు తగ్గించాలి అంటూ హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ వద్ద పీవైఎల్ అనే సంఘం కార్యకర్తలు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సినిమాకు వచ్చిన ప్రేక్షకులు తమ అభిప్రాయాలు తెలుపుతూ సంతాకాలు చేయాలన్నారు. థియేటర్ ముందు ఓ బోర్డు పెట్టి సంతాకాలు సేకరించగా థియేటర్ సిబ్బంది వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో టికెట్, స్నాక్స్, పార్కింగ్ టికెట్ ధరలు తగ్గించాలంటూ పీవైఎల్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ప్రతిఒక్కరూ తమకు మద్దతు తెలపాలని ఉద్యమం చేస్తేనే టికెట్ ధరలు తగ్గుతాయని అన్నారు. ఈ క్రమంలో కాసేపు థియేటర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. థియేటర్ వద్ద ఆందోళన చేయవద్దని కావాలంటే కేసులు పెట్టుకోవాలని సిబ్బంది ఆందోళనకారులను అక్కడ నుండి పంపించే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం టికెట్ ధరలు భారీగా ఉన్న సంగతి తెలిసిందే. బాల్కనీ టికెట్ ధర కొన్ని థియేటర్లలో 200పైగానే ఉంది. డ్రెస్ సర్కిల్ టికెట్ ధరలు రూ.150పైగానే ఉన్నాయి. మరోవైపు బయట సమోసా రూ.20 ఉంటే థియేటర్లలో రూ.50కి అమ్ముతున్నారు. దీంతో సామాన్యుల జేబులకు చిల్లు పడుతోంది. ఈక్రమంలోనే చాలా కాలంగా ధరలు తగ్గించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# అమరావతిని అగ్రగామి ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం: కేంద్రమంత్రి

ఒకే ప్రాంతంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ)తో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) వంటి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన 25కు పైగా బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు కావడం అనేది అత్యంత అరుదైన, కీలకమైన ఘట్టంగా పేర్కొన్నారు. ఈ "ఫైనాన్షియల్ హబ్" కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాదు అన్నారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పునాది అని స్పష్టం చేశారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో అమరావతి ఒకటిగా నిలవడానికి ఈ పెట్టుబడులు దోహదపడతాయి అన్నారు. ఈ కేంద్ర కార్యాలయాలు రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మారుస్తాయన్నారు.

ఈ బహుళ ప్రధాన కార్యాలయాల ఏర్పాటు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్యాంకింగ్, బీమా రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అమరావతి ఒక కేంద్రంగా మారుతుందన్నారు. ఇది రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచుతుందని తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇటీవల ఆర్థికంగా ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి, స్థిరమైన ప్రగతిని సాధించే దిశగా ప్రయాణించాలని కేంద్రం ఆకాంక్షిస్తోందన్నారు. కేంద్రం అందిస్తున్న నిధులను సక్రమంగా, పారదర్శకంగా వినియోగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని కేంద్రమంత్రి ఈ సందర్భంగా కోరారు. రాష్ట్రం తీసుకునే ప్రతి ఆర్థిక నిర్ణయానికి కేంద్రం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. ?ఈ శంకుస్థాపన కార్యక్రమం అమరావతి చరిత్రలో ఒక నూతన అధ్యాయమని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తును సాధిస్తుందని కేంద్రమంత్రి సీతారామన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మంగ్లీ పాటపై అసభ్యకర కామెంట్స్..

## కేసు పెట్టడంతో దిగొచ్చిన మేడిపల్లి స్టార్

ఆ వీడియో నెట్టింట తెగ వైరల్ అయ్యింది. దీంతో మంగ్లీ ఎస్ ఆర్ నగర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. తన పాటను కించపరుస్తూ అసభ్యకర కామెంట్స్ చేశాడని, పాటనే కాకుండా ఎస్టీ సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడాడని ఫిర్యాదులో పేర్కొంది. సింగర్ మంగ్లీ ఇచ్చిన ఫిర్యాదుతో కేవలం కొన్ని గంటల్లోనే నిందితుడు సోషల్ మీడియాలో రీల్స్ చేసే మేడిపల్లి స్టార్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా మేడిపల్లి స్టార్ మళ్లీ ఇలా రిపీట్ చేయను అని మంగ్లీ క్షమించాలని వేడుకున్నాడు. తాను వీడియోను ట్రోల్ చేయలేదని పాట ట్రెండింగ్ లో ఉందని పాటకు వచ్చిన కామెంట్స్ పై ట్రోల్స్ చేశానని చెప్పాడు. దయచేసి తనను విడిచిపెట్టాలని కోరాడు. కాగా నిందితుడు గతంలోనూ సోషల్ మీడియాలో ఇలాంటి అసభ్యకర కామెంట్లే చేశాడు.

# ఏపీ సర్కార్ మరో బిగ్ ప్లాన్..

## తెరపైకి పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్ట్

బనకచర్లకు బ్రేక్..

ఏపీ ప్రభుత్వం రూ.80 వేలకోట్లతో పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మించాలని ముందుగా ప్లాన్ చేసింది. అయితే.. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సర్వత్రా నిరసన తెలిపింది. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ప్రాజెక్టులను ఒప్పుకొనేది లేదని, గోదావరిలో రాష్ట్ర వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోకూడదని నిర్ణయించింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు చట్టపరంగా, న్యాయపరంగా అన్ని చర్యలు చేపట్టాలని, అన్ని వేదికలను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సీరియస్‌గా నిర్ణయం తీసుకొని ఆ దిశగా ముందుకు సాగింది. మరోవైపు కేంద్రంలోని కీలక మంత్రులను కలిసి విన్నవించడంతోపాటు సీడబ్ల్యూసీ దృష్టికి సైతం తీసుకెళ్లింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా.. అన్ని పార్టీలకు చెందిన ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసింది. సొంత పార్టీ ఎమ్మెల్యేలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి ఈ అక్రమ ప్రాజెక్టుకు పూర్తి అవగాహన కల్పించింది. అంతేకాకుండా.. కేంద్రానికి చివరకు అల్టిమేటం సైతం జారీ చేసింది. తెలంగాణను కాదని ఏపీ అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టుకు అనుమతులు ఇస్తే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేసింది. దాంతో కేంద్రం సైతం ఈ విషయంలో వెనక్కి తగ్గింది. ముందుగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు కోసం దరఖాస్తు చేసిన పర్యావరణ అనుమతులను రిజెక్ట్ చేసింది. ఆ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చేది లేదని ఏపీకి స్పష్టం చేసింది.

తెర మీదకు కొత్త లింక్..

అయితే.. ఇప్పటివరకు పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు క్యాన్సిల్ అయిందని అంతా భావించారు. ఇటీవల ఏపీ ప్రభుత్వం సైతం బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి టెండర్లను ఆహ్వానించింది. ఆ వెంటనే ఆ నిర్ణయాన్ని విరమించుకుంది. దాంతో అంతా ప్రాజెక్టు ఇక పట్టాలెక్కదని భావించారు. కానీ.. ఏపీ మాత్రం ప్రాజెక్టును పేరును మార్చి కొత్త ప్రాజెక్టును తెరమీదకు తీసుకొచ్చింది. 'పోలవరం-నల్లమలసాగర్' లింక్ ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు సిద్ధం అయింది. అవే గోదావరి నీటి వినియోగానికి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంది. అంతేకాకుండా తాజాగా టెండర్లను ఆహ్వానించింది. అయితే.. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇదే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన సందర్భంలో ఏపీ ప్రభుత్వం కొత్త పేరుతో మరో ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నట్లు ముందుగానే కేంద్రాన్ని అలర్ట్ చేశారు. ఏ పేరుతో వచ్చినా పర్మిషన్లు ఇవ్వరాదంటూ కోరారు. ఆయన విజ్ఞప్తి చేసిన నాలుగైదు రోజుల్లోనే ఏపీ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టును తెరమీదకు తీసుకొచ్చి డీపీఆర్ తయారీకి టెండర్లను ఆహ్వానించడం ఆసక్తికరంగా మారింది. ఇప్పుడు ఈ ప్రాజెక్టుపైనా కొట్లాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నది. మరోసారి.. ఏపీ నిర్ణయాన్ని తప్పుబడుతూ సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ తదుపరి కార్యాచరణను ప్రకటించేందుకు సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది. ఎట్టిపరిస్థితిల్లోనూ ఈ ప్రాజెక్టును సైతం అడ్డుకొని తీరుతామని చెబుతున్నారు.

# పల్నాడు జంట హత్యల కేసు.. పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పల్నాడు జంట హత్యల కేసులో వారు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను సుప్రీం ధర్మాసనం కొట్టివేసింది. ముందస్తు బెయిల్ కోసం రెండు పిటిషన్లు దాఖలు చేయగా.. వారిద్దరికీ ముందస్తు బెయిల్ పొందే అర్హత లేదని జస్టిస్ సందీప్ మెహతా తెలిపారు. గతంలో అరెస్టుపై ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సైతం ఎత్తివేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో సరెండర్ అయ్యేందుకు సమయం కావాలని పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఈ ఏడాది మే24న గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య, అతని సోదరుడు జవిశెట్టి కోటేశ్వరరావు తెలంగాణలో హుజూర్ నగర్ జిల్లాలో ఒక పెళ్లికి అటెండై బైక్ పై గ్రామానికి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఆరోజు సాయంత్రం 5 గంటల సమయంలో వెల్దుర్తి మండలం బొదిలవీడు వద్ద వారిని ఒక స్కార్పియో వాహనం ఢీ కొట్టింది. స్పాట్ లో మొద్దయ్య చనిపోగా.. కొనఊపిరితో ఉన్న కోటేశ్వరరావును రాయితో మోది చంపినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం స్కార్పియోను వదిలి పరారయ్యారు. టీడీపీకి చెందిన వీరిద్దరి మరణంపై తనకు అనుమానాలున్నాయని స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డితో పాటు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదయింది. మొత్తం ఏడుగురిపై కేసు నమోదవ్వగా.. ఏ-1 గా జవిశెట్టి శ్రీను, ఏ-2గా తోట వెంకట్రావ్, ఏ-3గా తోట గురవయ్య, ఏ-4గా నాగరాజ్, ఏ-5గా తోట వెంకటేశ్వర్లు ఉన్నారు. ఇందులో ఏ-6గా మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ-7గా పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని చేర్చారు. దీంతో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి బ్రదర్స్ ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా సుప్రీంకోర్టు వారి పిటిషన్ ను కొట్టివేసింది.

# యువకుడు వేధిస్తున్నాడని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..

## పరిస్థితి విషమం

**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా సీకే పల్లిలో విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. గత కొన్ని రోజులుగా యువకుడు వేధిస్తున్నాడని విద్యార్థిని ధర్మవరం పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసు తమ పరిధిలోకి రాదని సీకే పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయాలని అక్కడి పోలీసులు ఆమెకు సూచించారు.

పైగా కేసు నమోదు చేయకుండా సీకేపల్లి పోలీసులు తమ పట్ల దుర్భాషలాడారన్న మనస్తాపంతో విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తండ్రి ఆమెను కిందకు దించి అనంతపురం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె పరిస్థితి విషమం మారింది. బెంగళూరులో వైద్యం చేయించాలని అనంతపురం వైద్యులు సూచించగా ఆర్థిక స్థోమత లేదని యువతి తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఆమెకు అనంతపురంలోనే చికిత్స అందిస్తున్నారు.

# జనవరి 1న సరెండర్ అవుతాం..

## MMC జోన్ ప్రతినిధి అనంత్ పేరిట లేఖ విడుదల

దీంతో మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా వెల్లడించారు. కానీ ఈ లొంగుబాటు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు మూడు రాష్ట్ర ప్రభుత్వాలు పరిధిలోని భద్రతా బలగాలు, పోలీసుల కూబింగ్ ఆపరేషన్లను నిలిపివేయాలని కోరారు. ఎక్కడా కూడా అరెస్టులు, బూటకు ఎన్‌కౌంటర్లు, దాడులు జరగకూడదని డిమాండ్ చేశారు. పెట్టిన గడవు వరకు ఆపరేషన్లు కొనసాగితే లొంగుబాట్ల ప్రక్రియకు అడ్డంకులు ఏర్పడతాయని, చివరికి విఫలమవుతుందని పేర్కొన్నారు.

ఎవరు ఎక్కువ సహకారం ఇస్తే ఆ ప్రభుత్వం వెంటే..

గతంలో ఛత్తీస్‌గఢ్‌లో సతీష్ దాదాతో పాటు మహారాష్ట్రలో సోనూ దాదా లాగా సీఎం లేదా హోంమంత్రి సమక్షంలోనే మా కామ్రేడ్స్ ఆయుధాలు పక్కనపెట్టి జనజీవన స్రవంతిలో చేరుతారని లేఖలో అనంత్ ప్రస్తావించారు. వచ్చే ఒక నెలలో ఈ మొత్తం ప్రక్రియను శాంతియుతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. లొంగుబాట్ల విషయంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ సహకారం అందిస్తే ఆ రాష్ట్ర సీఎంతో పాటు హోంమంత్రి సమక్షంలోనే ఆయుధాలను అప్పగిస్తామని ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ శర్మ ఇప్పటికే రేడియోలో 10 నుంచి 15 రోజుల సమయం కావాలని చెప్పిన మాటను గౌరవిస్తున్నామని, కానీ, జనవరి 1, 2026 తేదీలో ఎటువంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రభుత్వం ముందు కొన్ని డిమాండ్స్‌ను మందు పెడతామని తెలిపారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల నుంచి ఇంత వరకు స్పందన రాలేదని, ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నుంచి త్వరలోనే సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని అన్నారు.

కామ్రేడ్స్ హింస్మాత్మక చర్యలు వద్దు..

లొంగుబాట్లపై తేదీ ప్రకటించిన నేపథ్యంలో ఎంఎంసీ పరిధిలో మావోయిస్టు పార్టీ అగ్ర నేతల నుంచి కీలక ఆదేశాలు జారీ చేసినట్లుగా లేఖలో తెలిపారు. జనవరి 1 2026 వరకు ఎక్కడా ఎలాంటి హింసాత్మక చర్యలు చేపట్టొద్దని ఆదేశించామన్నారు. ఈ సంవత్సరం PLGA వారోత్సవాల దూరంగా ఉండాలని తెలిపినట్లుగా వెల్లడించారు. సరెండర్లపై రేడియో ద్వారా ఆడియో సందేశం విడుదల చేస్తామని అందరూ స్పష్టంగా విని, ఒకరితో ఒకరు కోఆర్డినేట్ చేసుకోవాలని సూచించినట్లుగా లేఖలో ప్రస్తావించారు.

కమ్యూనికేషన్ కోసం ఓపెన్ ఫ్రీక్వెన్సీ నెంబర్ విడుదల..

లొగుబాట్లకు సంబంధించి MMC జోన్ పరిధిలోని మావోయిస్టులకు రోజూ ఉదయం 11 నుంచి 11.15 వరకు రేడియో ఫ్రీక్వెన్సీ 435.715 MHz ద్వారా ఒకరితో ఒకరు సంప్రదించవచ్చని ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన లేఖను మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు రేడియోలో, జాతీయ మీడియాలో వెంటనే ప్రచురించాలని, తమ ఆడియో సందేశాన్ని కూడా అన్ని మీడియా సంస్థలు వార్తా సమయానికి ముందు ప్రసారం చేయాలని మావోయిస్టులు కోరారు.

తాజా పరిణామంతో మూడు రాష్ట్రాల భద్రతా దళాలు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అలర్ట్‌కు అయింది. సరెండర్లపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇప్పటికే సానుకూల సంకేతాలు ఇవ్వగా.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# పోలీస్ వాహనంపై మృతదేహం ఎక్కించి నిరసన..

## నిజామాబాద్ జిల్లాలో ఘటన

**న్యూస్ డెస్క్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని ఏర్గట్ల పోలీస్ స్టేషన్ సమీపంలో సంచలన ఘటన వెలుగు చూసింది. ఓ యువకుడి మృతదేహాన్ని పోలీస్? వాహనంపై కట్టేసి దోంచందా గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే..దోంచందా గ్రామానికి చెందిన నాగిరెడ్డి శ్రీకాంత్? రెడ్డి (29) ప్రేమించి మోసపోయానని మనస్తాపంతో నవంబర్? 6న విషం తాగాడు. కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. దీంతో బంధువులు యువకుడి మృతదేహంతో శుక్రవారం ఉదయం ఏర్గట్ల పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నించారు. తాళ్లరాంపూర్ రోడ్డులో పోలీసులు అడ్డుకున్నారు. ఆగ్రహంతో బంధువులు మృతదేహాన్ని పోలీస్?వాహనంపై కట్టేశారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు ఘటనా స్థలంలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన

## 'అలాంటి వాటిని రద్దు చేస్తాం'

ఏకగ్రీవాలపై మార్గదర్శకాలు..

ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఏకగ్రీవాలకు సంబంధించి నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. వేలంపాట, బెదిరింపులతో ఏకగ్రీవం జరిగితే అది చెల్లదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ (ఎన్నికల నిర్వహణ) చట్టం-2018లోని 15వ నిబంధన ప్రకారం.. ఒక స్థానంలో ఒక్క అభ్యర్థి పోటీలో ఉంటేనే.. దాన్ని ఏకగ్రీవంగా ప్రకటించాలి. అయితే ఇందుకోసం గ్రామంలోని ప్రజలను ప్రలోభపెట్టడం, ఇతర అభ్యర్థులను భయపెట్టడం, మోసం చేయడం వంటివి జరగకుండా చూసుకోవాలని సూచించింది. ఏకగ్రీవాలకు సంబంధించి ప్రతి జిల్లాలో ప్రత్యేక పర్యవేక్షక విభాగాలను నియమించాలని ఈసీ ఆదేశించింది. ఈ ప్రత్యేక పర్యవేక్షక విభాగాలు ఏకగ్రీవాలపై వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తాయి. పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాల కోసం వేలంపాట, ప్రలోభాలు, బెదిరింపులు, ఇతర మోసాలకు పాల్పడితే.. వాటి గురించి ప్రత్యేక పర్యవేక్షక విభాగాలకు ఫిర్యాదు చేయవచ్చు. ఇవి లిఖితపూర్వకంగా, మౌఖికంగా, వాట్సాప్, వార్తాపత్రిక క్లిప్పింగ్‌ల రూపంలో కూడా ఉండవచ్చని స్పష్టం చేసింది.

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

వార్డు, సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయితే.. అభ్యర్థుల నుంచి తప్పకుండా ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళు ,, ప్రలోభాలకు గురి కాకుండా స్వచ్ఛందంగా నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు అభ్యర్థులు డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో, పోటీలో ఉన్న ఏకైక అభ్యర్థి కూడా, తాను ప్రత్యర్థుల ఉపసంహరణ కోసం డబ్బులు ఇవ్వలేదని, వేలంపాటలో పాల్గొనలేదని, బెదిరింపులకు దిగలేదని ధ్రువీకరిస్తూ ఒక పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్ధారణ అయిన తర్వాత.. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే రిటర్నింగ్ అధికారులు నిర్దేశిత నమూనాలో ఎన్నిక పత్రాన్ని అందజేయాలి. అయితే ప్రత్యేక పర్యవేక్షక విభాగం నుంచి వచ్చిన నివేదికలను జిల్లా కలెక్టర్ పూర్తిగా పరిశీలించిన తర్వాతనే వీటిని డిక్లేర్ చేయాల్సి ఉంటుంది. అలానే ఏకగ్రీవాలపై ఎలాంటి ఫిర్యాదులు, అభ్యంతరాలు లేకుంటేనే దాన్ని ఆమోదిస్తారు. ఈ ఫలితాల సమాచారంతో ఒక నివేదికను రూపొందించి.. దాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపాలి. ఏదైనా గ్రామంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనట్లు గుర్తిస్తే.. ఆ గ్రామ ఏకగ్రీవ ఎన్నిక ఫలితాన్ని రద్దు చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అభ్యర్థులు వీటిని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు.

# సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే..




**ఖమ్మం బ్యూరో, 28 నవంబర్ (కెరటం న్యూస్):** ఖానాపురం హవేలీ లిక్కి కృష్ణారావు అధ్యక్షతన పూలే అంబేద్కర్ అధ్యయన వేదికలో మహాత్మ జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి బహుజన మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాధు మాలాద్రి గారు హాజరై మొట్టమొదటిసారిగా భారతదేశంలోనే చదువు అందరికీ కావాలని ఉద్యమించినవాడు తనే స్వయంగా ఉచిత పాఠశాలను ఏర్పాటు చేసి తన భార్యకు కూడా చదువును నేర్పి బాలలకు మహిళలకు ఎన్ని ఆటంకాలు వచ్చినా చదువును అందించిన వాడు పూలే.. సత్యశోధక్ సమాజాన్ని ఏర్పాటు చేసి నిజాన్ని నిబ్బరంగా చెప్పినవాడు బ్రాహ్మణీయ వాదము నుండి సూద్రా కులాలు విముక్తి కావాలని పోరాడినవాడు పూలే.. అంతటి మహనీయుడు చూపించిన మార్గం ద్వారా నేడు తెలంగాణ ప్రాంతంలో బీసీల రిజర్వేషన్ కోసం ఉద్యమించాలని అన్నారు. మరో వక్త సుంకర శీను గారు మాట్లాడుతూ పూలే ఆశయాన్ని కొనసాగించడం అంటే నేడు బీసీలు రిజర్వేషన్ సాధించుకోవడంతోపాటు బహుజన రాజ్యాధికారం సాధించడమే ఆశయంగా ఉండాలని అన్నారు. బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె పర్వతాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బహుజన కుల సంఘాలను ఏర్పాటు చేసి రాజ్యంపై తిరుగుబాటుడంకా మోగించిన కామ్రేడ్ మారోజు వీరన్న ఆలోచనతో ఈ రాష్ట్రంలో కుల సంఘాల నిర్మాణం జరిగి మా శక్తిగా ఎదగాలని సూచించారు. బిఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రాహ్మణీయ వాదాన్ని ఆధిపత్య కులాలను వారు ఏర్పాటు చేసుకున్నా రాజకీయ పార్టీలను తక్షణమే బీసీలు వాటి నుండి బయటపడాలని సూచించారు. పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొడకండి రాంబాబు మాట్లాడుతూ నవంబర్ 30న బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆవిర్భావ సదస్సును జయప్రదం చేయాల్సిన బాధ్యత దళిత బహుజన జాతులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక నాయకులు మేకల సుగుణ, బహుజన టీచర్స్ యూనియన్ లీడర్ నాగమణి గారు, సంపత్ గారు,లింగనబోయిన లక్ష్మణ్, పి ఆర్ దేవి, పెరుగు రమణ, ముత్యాలరావు, నరేష్, దార వెంకయ్య, బసవయ్య, తదిరులు పాల్గొన్నారు.



# ఎంపీ వద్దిరాజుకు జీవన సాఫల్య పురస్కారం

## బహుకరించిన భారత్ గౌరవ్ ఫౌండేషన్






**హైదరాబాద్ బ్యూరో, 28 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల చంద్రశేఖర రావు సాధించి పెట్టడమే కాక తన పదేళ్ల పాలనలో హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. కేసీఆర్ మార్గనిర్దేశనంలో ఐటీ, పురపాలక, పరిశ్రమల శాఖల మంత్రిగా కే.టీ. రామారావు అమెరికాలోని న్యూయార్క్, డల్లాస్, చికాగోలకు ధీటుగా హైదరాబాద్ నగరాన్ని గొప్పగా అభివృద్ధి చేశారని ఎంపీ రవిచంద్ర వివరించారు. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న భారత్ గౌరవ్ ఫౌండేషన్ ఎంపీ రవిచంద్రకు జీవన సాఫల్య పురస్కారాన్ని బహుకరించింది. ఫౌండేషన్ 8వ వార్షిక పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్ హైటెక్ సిటీలోని అవాసా హెూటల్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి పురస్కారాన్ని అందుకున్న ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో హైదరాబాద్ ఐటీ, ఫార్మా హబ్ గా రూపు దాల్చిందని... ఇక్కడ నుంచి ఎంతోమంది గొప్పగా ఎదిగి పలు దేశాలలో ఉన్నత పదవుల్లో అధిష్టించి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. మన దేశంలో యువతకు ఏ మాత్రం కొదవ లేదని, అపారమైన యువ సంపద ఉందని,40 ఏండ్ల వయస్సు లోబడి ఉన్న వాళ్లు కోట్ల మంది ఉండడాన్ని మొన్ననే ఖమ్మంలో సర్దార్ పటేల్ "యూనిటీ రన్"సందర్భంగా గుర్తు చేశానన్నారు. యువతకు అవకాశాలు ఇస్తే,వారి శక్తియుక్తులను సద్వినియోగం చేసుకుంటే దేశం మరింత గొప్పగా ప్రగతిపథాన పరుగులు పెడుతుందన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు సందేశ్ యాదవ్, ఆయన బృందం ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీ రవిచంద్ర చెప్పారు. రాజ్యసభ సభ్యుడిగా తాను విద్య, వైద్యారోగ్య రంగాల ఉన్నతికి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవా లక్ష్మణ్, చిన్నజీయర్ స్వామి, ఒలింపిక్ ఛాంపియన్ సైనా నెహ్వాల్, ఐపీఎస్ అధికారి అంజనీకుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు నిర్వాహకులు పుష్పగుచ్ఛమిచ్చి సాదర స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు.



# ఫిలా టెలి ఎగ్జిబిషన్ ని తిలకించిన స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు



**ఖమ్మం ఎడ్యుకేషన్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు నగరంలోని ఎన్ఎస్పీ కాలనీలో ఉన్న డిబిఆర్సి భవన్ లో ఏర్పాటు చేసిన ఫిలా టెలి ఎగ్జిబిషన్ ను శుక్రవారం తిలకించారు. ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసిన ప్రాచీన పోస్టల్ స్టాంప్ ల సేకరణను, ప్రాచీన నాణేలు, ప్రస్తుత నాణేలను విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. పోస్ట్ కార్డులను, ఎన్వలప్ కవర్లను పరిశీలించారు. అనతి కాలం నుంచి మొదలుకొని ఇప్పటివరకు అందుబాటులో ఉన్న పోస్టల్ స్టాంపులు, నాణేలను తిలకించి వాటి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోస్టల్ శాఖ అందుబాటులో ఉంచిన పోస్టల్ స్టాంప్ లతో పాటు పలు దేశాల పోస్టల్ స్టాంప్ లు, ప్రాచీన కాలంలో వాడిన నాణేలను ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు వాటి వివరాలను తెలుసుకునే అవకాశం ఏర్పడింది అని తెలిపారు. ఇటువంటి ఎగ్జిబిషన్లను వివిధ అంశాలపై ఏర్పాటు చేస్తే పలు అంశాలపై విద్యార్థులకు ప్రయోజనకరం, వివరాల పట్ల అవగాహన పెంచుకోగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# వ్యాపారికి రూ.10వేల జరిమానా



**కారేపల్లి, 28 నవంబర్ (కెరటం న్యూస్):** లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న ఖమ్మంకు చెందిన ధాన్యం వ్యాపారి కే వెంకటనారాయణ దగ్గర మార్కెట్ ఫీజు 2800 వసూలు చేయడం జరిగింది లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నందుకు గాను 10 వేలు రూపాయలు ఫైన్ వేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో సిబ్బంది లక్ష్మయ్య, రంజిత్, మధు, సందీప్, రమేష్ పాల్గొన్నారు



# సీపీఎం, బీఆర్ఎస్ మైత్రి

## పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

## పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల



**ఖమ్మం రూరల్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** పాలేరు నియోజకవర్గంలో సీపీఎం, బీఆర్ఎస్ పొత్తులో ఎన్నికలకు వెళుతుందని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. మండలంలోని పోలేపల్లి గ్రామం వద్ద గల సీఎంఆర్ ఫంక్షన్ హాల్ లో సీపీఎం, బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ... ఎన్నికల్లో సమిష్టిగా పనిచేసి అధికార పార్టీకి ధీటుగా సమాధానం చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు ఎటువంటి భేషజాలకు పోకుండా సోదర భావంతో మెలిగి ఓట్లు క్రాస్ అవ్వకుండా అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఖమ్మం రూరల్ మండలంలోని 21 పంచాయతీల్లో 17 పంచాయతీల్లో బీఆర్ఎస్, నాలుగు పంచాయతీల్లో సీపీఎం పోటీ చేస్తుందని తెలిపారు. మండలంలోని ఎం. వెంకటాయ పాలెం, కాచిరాజు గూడెం, పొన్నెకల్లు, ఆరెకోడు గ్రామ పంచాయతీలల్లో సీపీఎం పోటీ చేస్తుందని, మిగిలిన 17 పంచాయతీల్లో బీఆర్ఎస్ పోటీ చేస్తుందని తెలిపారు.గ్రామాల్లో కార్యకర్తలు సమన్వయం చేసుకొని అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ అనేక హామీలతో అధికారం చేపట్టి ప్రజలను నట్టేట్ట ముంచిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలని చెప్పి ఒక గ్యారెంటీ మాత్రమే ఫ్రీ బస్ అమలు చేశారని, మిగతా ఐదు గ్యారంటీల ఊసే లేదన్నారు. కార్యకర్తలంతా కాంగ్రెస్ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి సీపీఎం, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపులకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్,మాజీ వైస్ ఎంపీపీ గుడిబోయిన దర్గయ్య, సీపీఎం నాయకులు నంద్ర ప్రసాద్, పీ.మోహన్ రావు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, వడ్లమూడి నాగేశ్వరరావు, పీ.సంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులను ఖండించండి

## సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్





**ఖమ్మం బ్యూరో, 28 నవంబర్ (కెరటం న్యూస్):** ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తున్న సిపిఎం పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను ఖండించాలని సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు లు కోరారు. శుక్రవారం సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ పార్క్ నుండి ఎఫ్సీఐ గుట్ట మీద నుండి ప్రకాష్ నగర్ శ్రీనివాస్ నగర్ వరకు పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాస రావులు మాట్లాడుతూ 17,27,28,29,30 వ డివిజన్ల లో రోడ్డు విస్తరణలో భాగంగా చాలామంది నిరుపేదల ఇండ్లు తీసివేస్తామని చెప్పి తొలగిస్తామని చెప్పి స్థానిక కార్పొరేటర్లు మరియు కాంట్రాక్టర్లు ప్రజలను భయాందోళన గురి చేస్తున్నారు అని ఆరోపించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బాధితులతో పాదయాత్ర ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీ నిర్వహిస్తుంటే పోలీసులు సిపిఎం నాయకులు ప్రజలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు అని విమర్శించారు అరెస్టు చేసిన వారిలో సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, యర్రా రంజిత్, సారంగి పాపారావు మరియు బాధితులను కూడా అరెస్టు చేయడం దుర్మార్గం అని ఆరోపించారు జరిగింది. 29వ డివిజన్లో రోడ్డు విస్తరణలో భాగంగా అక్కడ నివాసముంటున్న ఒక 20 కుటుంబాలను ఇల్లు అడ్డుగా వస్తున్నాయి అని చెప్పి రోడ్డును సక్రమంగా వేయకుండా వంకరలు తిప్పి ఆ పేద ప్రజల లెట్రిన్ బాత్రూంలు కూలగొట్టడం జరిగింది అని విమర్శించారు ప్రజలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రోడ్డు ఎంత వెడల్పు వస్తుందో చెప్పకుండా నిర్ధారణ చేయకుండా కార్పొరేటర్లు ఇస్తానుసారంగా వాళ్లకు ఇష్టం వచ్చిన చోట వాళ్లకి ఇస్తాను సారంగా రోడ్డును ఎటువైపు మల్లాలంటే అటువైపు మలుచుకుంటూ వెళ్తా ఉన్నారు అని తెలిపారు .కచ్చితంగా అధికారులు ప్లాన్ ప్రకారం కాకుండా 80 అడుగులు అని ఒకసారి, మరోసారి 70 అడుగులు అని ప్రజలను భయాందోళన గురిచేస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా రోడ్డును వేయాలని వారు కోరారు. నగరంలో ప్రధానమైన రోడ్లు వెడల్పు చేయకుండా ట్రాఫిక్ లేని అనుబంధ రహదారులను విస్తరణ చేయడం ఎవరికి లాభం అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ ల లాభాలు కోసం రహదారులు విస్తరణ చేస్తున్నారు అని ఆరోపించారు. ఈ సమస్య విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కమిషనర్, మేయర్ వెంటనే స్పందించి స్థానిక ప్రజలతో చర్చించాలి అని డిమాండ్ చేశారు. రహదారి విస్తరణ నిలుపుదల చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. శనివారం ఈ సమస్య పై కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, సిపిఐ 31 కార్యదర్శి నూనె .శశిధర్, భూక్య రవీందర్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజెనేపల్లి శ్రీనివాసరావు, సిపిఎం 31 డివిజన్ కార్పొరేటర్ ఎర్ర గోపి,షేక్ సైదులు, షేక్ హిమామ్,యర్రా. రంజిత్, సారంగి పాపారావు, రంగు హనుమంతా చారి, నాయిని నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బిల్లు కు తొలి ఓటు వేసే అవకాశం నాకు దక్కింది

## మాజీ ఎంపీ నామ



**హైదరాబాద్ బ్యూరో, 28 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన దీక్ష దివస్ ఉద్యమం ఈ తరం మాత్రమే కాదు, రాబోయే తరాలు కూడా స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందని, ఉద్యమానికి కొత్త దిశ ఇచ్చిన మహోన్నత ఘట్టం దీక్ష దివస్ అని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ధ్యేయంతో ఆమరణ నిరాహార దీక్షకు దిగిన కేసిఆర్, "తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో" అంటూ నినాదంతో 29 నవంబర్ కేసీఆర్ చేపట్టిన దీక్ష దివస్, రాష్ట్ర ప్రజల కలల్ని నిజం చేసిన ప్రజా పోరాట దినంగా నిలిచిపోయిందన్నారు. దశాబ్దాలుగా అందని తెలంగాణ స్వప్నానికి కేసీఆర్ చూపిన అహింసాయుత పోరాట మార్గం తెలంగాణ రాష్ట్ర సాధన దిశగా అడుగులు వేసిందన్నారు. నిరాహార దీక్షతో కేసీఆర్ ప్రాణాలను పణంగా పెట్టి పోరాటాన్ని ముందుకు నడిపారనే విషయాన్ని ఆయన మరోసారి గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో రాత్రింబవళ్లు నాడు పోరాడిన తెలంగాణ విద్యార్థి లోకం, ఉద్యమకారులు, ఉద్యోగులు, అమరులు త్యాగాలు ఎన్నటికీ మరువలేమన్నారు. నేటి తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం, ప్రజల గౌరవ జీవనం అన్నీ ఉద్యమ ఫలితమేనని ఆయన అన్నారు. నేడు తెలంగాణను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని, గతంలో ఎలా పోరాడామో నేడు కూడా అదే స్ఫూర్తి కొనసాగాలని ఆయన పిలుపునిచ్చారు. దీక్ష దినోత్సవం సందర్భంగా ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త ఉద్యమ చరిత్రను గుర్తుచేసుకుని, ప్రజల మధ్యకు వెళ్లి దీక్ష ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. కేసీఆర్ స్ఫూర్తి, కేటీఆర్ నాయకత్వం, ఉద్యమ నాయకులు శ్రమ ఇవన్నీ కలిసి తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తాయని నామ విశ్వాసం వ్యక్తం చేశారు. 15వ లోక్‌సభలో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినపుడు తాను ఎంపీగా ఉండి తెలంగాణ బిడ్డగా ఆ బిల్లు పై తొలి ఓటు వేసానన్నారు. దీక్ష దివస్ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జరిగే కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా 57వ ఆవిర్భావ దినోత్సవం



**ఖమ్మం బ్యూరో, 28 నవంబర్ (కెరటం న్యూస్):** గురువారం ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ ముంబై వారు 56 సంవత్సరాలు పూర్తి చేసుకొని 57 వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా వారి ఆధ్వర్యంలో పాల్వంచ పరిసర ప్రాంతాల్లోని పామాయిల్ రైతులకు అవగాహన సదస్సు ను పాండురంగాపురంలో ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా మొక్కలకి ఏ పోషకాలు అవసరం పోషకాల ఆవశ్యకతను తెలియజేయడం జరిగింది పామాయిల్ పంటలో రకాలు అంతర పంటల గురించి మాట్లాడటం జరిగింది సరైన సమయంలో సరైన మోతాదులో మొక్కకు కావాల్సిన పోషకాలు ఇచ్చి అధిక దిగుబడి పొందాలని ఆశించారు. ఈ సదస్సులో పాల్గొనిన రైతులకు చిరు సత్కారంతోపాటు క్విజ్ ఏర్పాటు చేసి ఏరీస్ బ్యాటరీ స్ప్రేర్ మరియు ఏరీస్ ఉత్పాదనలను బహుమతులుగా ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా కంపెనీ ప్రతినిధులైన సీఈఓ నల్లపనేని బాబురావు, కృష్ణమూర్తి, నవీన్ రెడ్డి, నరసింహారావు, వెంకట్, వెంకన్న, అభిలాస్, జయాకర్, రంగయ్య మరియు పాల్వంచ ఫెర్టిలైజర్ వ్యాపారి అయినా ప్రసాద రావు గారు ఇతరులు రైతు సహోదరులు పాల్గొన్నారు.



# హాస్టల్ విద్యార్థులకు మెడికల్ క్యాంప్



**ఖమ్మం టౌన్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** ఈరోజు ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ (బి) ఖమ్మం నందు, విద్యార్థులకు యు పి హెచ్ సి మామిళ్లగూడెం, మెడికల్ ఆఫీసర్ కృష్ణ చైతన్య మెడికల్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులకు ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయేమో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేషన్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు, ఏఎన్ఎం దయామణి మరియు నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- **నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు చేయొద్దు**
- **అభ్యర్థుల పత్రాల సమర్పణపై అవగాహన కల్పించాలి**
- **వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**
- **పెద్దేముల్, యాలాల మండలాల్లోని క్లస్టర్ల పరిశీలన**



**వికారాబాద్, 28 నవంబర్ (కెరటం న్యూస్):** పంచాయతి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు చేయకుండా జాగ్రత్తగా ఉండాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం తాండూరు నియోజకవర్గం పెద్దేముల్, యాలాల మండలాల్లోని పంచాయతీ ఎన్నికల క్లస్టర్లను సందర్శించారు. ఆయా కేంద్రాలలో అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో అభ్యర్థుల నుంచి కావాల్సిన పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. నామినేషన్ల పత్రాలు స్పష్టంగా పరిశీలించుకునేలా అభ్యర్థులకు సహకరించాలని అన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల బ్యాంకు ఖాతా ఉండేలా చూసుకోవాలన్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు నిబంధనలకు అనుగుణంగా ఖర్చులు పెట్టాలనే విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సమయానికి అవసరానికి అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు రతన్ సింగ్, శ్రీనిజ, ఆర, ఏఆర్ఓలు తదితరులు ఉన్నారు.

# శ్రావణ భార్గవికి హేమ చంద్ర విడాకులు ఇచ్చాడా..

## ఎట్టకేలకి క్లారిటీ ఇచ్చాడుగా..!



**మూవీ న్యూస్ , 28 నవంబర్ (కెరటం న్యూస్):** ఒకప్పుడు టాలీవుడ్‌లో క్యూట్ కపుల్స్‌లో ఒకరిగా గుర్తింపు పొందిన జంట శ్రావణ భార్గవి - హేమచంద్ర. వీరిద్దరు వేర్వేరు దారుల్లో నడుస్తున్నారని చాలాకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ ఇద్దరికీ ఒక పాప ఉంది. అయితే సుమారు మూడు సంవత్సరాల క్రితమే వీరు విడిపోయారని సోషల్ మీడియా పోస్టుల ద్వారా అభిమానులు అంచనా వేస్తున్నా, ఈ విషయం గురించి ఇద్దరూ ఇప్పటిదాకా అధికారికంగా స్పందించలేదు. తాజాగా హేమచంద్రకి ఓ యూట్యూబ్ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇదే ప్రశ్న ఎదురైంది. మీ పెళ్లి జీవితంపై వస్తున్న రూమర్స్, కామెంట్లకు ఎందుకు స్పందించడం లేదని అడగగా, హేమచంద్ర ఇచ్చిన సమాధానం ప్రస్తుతం వైరల్ అవుతోంది.

వార్తలు నిజమా కాదా అన్నది పక్కన పెడితే, అవి తెలుసుకోవడం వల్ల ఎవరికి ఎలాంటి ప్రయోజనం ఉంటుందో ముందుగా చెప్పమని చెప్పండి. అప్పుడు మాత్రమే తాను సమాధానం ఇవ్వగలనని హేమచంద్ర అన్నారు. తనపైన వచ్చే కామెంట్లు లేదా రూమర్స్ తనను ఏ విధంగానూ ప్రభావితం చేయవని, సింగర్‌గా తన పనిపై మాత్రమే మాట్లాడదలచుకున్నానని ఆయన స్పష్టం చేశారు. తన వ్యక్తిగత జీవితంపై ఎవరైనా ప్రశ్నలు అడగాలనుకుంటే ఓ Q&A సెషన్ పెట్టొచ్చని, కానీ ముందుగా "ఈ విషయం నీకు ఎందుకు ఉపయోగపడుతుంది?" అనే ప్రశ్నకు వాళ్లు ఇచ్చే సమాధానం తనను సంతృప్తిపరచాలి అన్నారు.

విమర్శలు చేసే వారి మాటలు పట్టించుకునేంత టైం లేదని, జనాలు పక్క వాళ్ల వ్యక్తిగత జీవితాలపై సహజంగానే ఆసక్తి చూపుతారని, వర్క్ గురించే తెలిస్తే దాని గురించి మాట్లాడాలి తప్ప పర్సనల్ విషయాలు తెలుసుకోవడం అనవసరం అంటూ హేమచంద్ర వ్యాఖ్యానించారు. అయితే ఈ ఇంటర్వ్యూలో కూడా ఆయన శ్రావణ భార్గవితో నిజంగా విడిపోయారా లేదా? విడాకులు తీసుకున్నారా? ప్రస్తుతం వారి సంబంధం ఏ స్థితిలో ఉంది? అనే విషయాలకు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. దీనితో హేమచంద్ర ఇంటర్వ్యూ మరింత చర్చకు దారితీస్తోంది కానీ, పాత రూమర్స్‌కు మాత్రం ముగింపు పడలేదు.

# 'స్పిరిట్' సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ప్రభాస్



**మూవీ న్యూస్ , 28 నవంబర్ (కెరటం న్యూస్):** యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' షూటింగ్ మొదలైంది. ఈ సినిమా షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది.

తాజా సమాచారం ప్రకారం, హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా 'స్పిరిట్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది.

కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 'స్పిరిట్' చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా యొక్క రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.